క్లుప్తంగా

వసంత మహోత్సవాలకు ముహూర్తపు రాట



శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న ముహుర్తపు రాట కార్యక్రమం

సాలూరు: పట్టణంలోని 10వ వార్డు నెయ్యిల వీధిలో శ్రీరామమందిరం వద్ద సీతారామలీల వసంత మహోత్సవాల సందర్భంగా ఆదివారం ముహుర్తపు రాటను వేశారు. ఆకేటి రామకృష్ణ, లక్ష్మి దంపతులతో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పలు వీధుల నుంచి భక్తుల రాకతో స్థానికంగా ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంది.ప్రతి సంవత్సరం ఉగాది రోజున ప్రారంభమై 9 రోజుల పూజలు జరిపి శ్రీరామనవమి రోజున కల్యాణం, పట్టాభిషేకంతో ముగుస్తుందని నిర్వాహక ప్రతినిధి టెక్కలి ధర్మారావు తెలియజేశారు.

జనావాసాల్లోకి మల్లినాగు



బుడ్డిపేట రేవులో మల్లినాగుపాము

సీతానగరం: కొండల్లో నివాసం ఉండాల్సిన మల్లినాగు పాము జనావాసాల్లోకి రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని సువర్ణముఖినదిలో బుడ్డిపేట నీలాటి రేవులో ఆకులు పిచ్చిమొక్కలున్న కారణంగా బసలు కొడుతూ వస్తోంది. అదే సమయంలో నీలాటి రేవుమీదుగా బహిర్భూమికని వెళ్లిన ఎస్.వెంకటరమణకు మల్లి నాగుపాము తారస పడడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి పాము శబ్దాన్ని విన్న వెంకటరమణ అక్కడి నుంచి తప్పించుకుని బయటపడ్డాడు. పాము నదిలో దిగి అవతలి ఒడ్డుకు పోయిందని వెంకటరమణ తెలియజేశాడు.

పిచ్చికుక్క పట్టివేత



పిచ్చికుక్కను పట్టుకున్న సిబ్బంది

సాలూరు: పట్టణంలోని 18, 21 వార్డులు గొల్ల వీధి, దుర్గాన వీధులలో రెండు రోజుల పాటు పలువురిని గాయపరిచిన పిచ్చికుక్కను మున్సిపల్ సిబ్బంది పట్టుకున్నారు. మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పిచ్చికుక్కను పట్టుకున్నట్లు సిబ్బంది తెలిపారు. కాగా పిచ్చికుక్క దాడిలో పలువురు చిన్నారులకు గాయాలైన సంగతి విదితమే.

70మందికి ఉచిత వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యబృందం

బలిజిపేట: బలిజిపేటలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 70మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బలిజిపేట సత్యసాయి సేవాసమితి కన్వీనర్ వి.సుబ్బారావు ఆధ్వర్యంలో వారి డిపోవద్ద ఉచితవైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి 70మంది హాజరు కాగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన 40 మందిని విజయనగరం హాస్పిటల్‌కు వస్తే అక్కడ తక్కువ ధరకు వైద్యసేవలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించనున్నట్లు కన్వీనర్ సుబ్బారావు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు పి.రాజేష్, ఎ.లహరి, ఎం. జ్యోత్స్న, బి.రాజ్‌కుమార్, ఎ.యశ్వంత్‌కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కోలా వెంకటరావు



నూతన కార్యవర్గం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కోలా వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు రాజనాల వాసుదేవరావు తెలిపారు. ఆదివారం ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శిగా ఇనపకుర్తి రాజశేఖర్, కోశాధికారిగా తొలి రామ్మోహన్, గౌరవ అధ్యక్షులుగా వెల్లంకి అప్పలరాజు, దాసరి నర్సింగరావులను సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తెలగ కలస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకమంగా అందేలా చేస్తామని, సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

అగ్ని గంగమ్మకు పూజలు

పార్వతీపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజల ఆరాధ్య దైవమైన నీలావడి అగ్ని గంగమ్మ యాత్ర ఆదివారం నుంచి మంగళవారం వరకు జరగనుంది. ఆదివారం, అగ్ని గంగమ్మను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

కొబ్బరి నీరు ▶ ఆరోగ్యానికి మేలు

- వేసవిలో ఆరోగ్య ప్రయోజనాలు
- జోరుగా కొబ్బరి బొండాల వ్యాపారం



కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న వ్యాపారి



బలిజిపేట:

వేసవితాపం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సూర్య ప్రతాపం నుంచి ఉపశమనం పొందాలంటే శరీరంలో ఉండే వేడిని తగ్గించాలి. అందు కు ప్రస్తుతం కొబ్బరి బొండాల నీరే మంచి ఆరోగ్యసూత్రంగా ప్రజలు భావిస్తున్నారు. కొబ్బరి నీటిలో విటమిన్లు, మినరల్స్, ఎలక్ట్రోలైట్స్, ఎంజైమ్‌లు, ఎమినోయాసిడ్లు, సైటోకిన్ అధికంగా ఉంటాయి. శరీరానికి వేసవి నుంచి ఉపశమనం ఇచ్చే కొబ్బరి నీళ్లు రుచికి వగరుగా ఉన్నా ఆరోగ్యానికి ప్రయోజనాలను ఎన్నో కల్పిస్తున్నాయి. ఈ నీరు తాగడం వల్ల శరీరం నష్టపోయిన ఫ్లూయిడ్స్‌ను భర్తీ అవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడాది వేసవిలో ఉదయం 8గంటల వరకు సాదాసీదాగా ఉన్నప్పటికీ అక్కడి నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉంటోంది. బయటకు వచ్చి తిరిగిన వారు ఉష్ణతాపాన్ని తట్టుకునేందుకు చల్లని పానీయాల కోసం పరుగులు తీస్తున్నారు. శీతల పానీయాలు సేవించే కన్నా కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటి పానీయాలు తీసుకోవడం మేలని వైద్యులు సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో ఎలక్ట్రోలైట్ పొటాషియం అధికంగా కలిగి ఉండడం వల్ల ఇది శరీర ద్రవాల్లో ఎలక్ట్రోలైట్‌ని తిరిగి భర్తీ చేస్తుందని సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం ఎక్కువగా ఉండడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని వైద్యులు పేర్కొంటున్నా రు. గుండెపోటు ప్రమాదాలను తగ్గించడానికి ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

విస్తృతంగా వ్యాపారం

కొబ్బరి బొండాల వ్యాపారం విస్తృతమవుతోంది. వేసవితాపం పెరగడంతో చిరు వ్యాపారులు కొబ్బరి బొండాలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వాటిని గ్రామాల్లో విక్రయిస్తున్నారు. వేసవి సమయంలో కాకుండా ఇతర సమయాల్లోనూ కొబ్బరి బొండాల విక్రయాలు సాధారణంగా జరుగుతుంటాయి. వేసవి రావడంతో వాటి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సీజనల్‌గా చిరు వ్యాపారులు ఎక్కువవుతున్నారు. కొబ్బరి బొండాలను సైకిళ్లు, మోటారు సైకిళ్ల మీద, బల్ల రిక్షాలపైన పెట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో బొండాం కనీస ధర రూ. 25 ఉంటోంది.

దూరప్రాంతాల నుంచి తెచ్చిన విక్రయం

కొబ్బరి బొండాలు స్థానికంగా అందుబాటులో లేకపోయినా దూరప్రాంతాల నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. వేసవివల్ల కొబ్బరి బొండాల విక్రయాలు ఎక్కువగా ఉంటాయి. డిమాండ్ బాగా ఉంది. –అప్పుడు, వ్యాపారి, పెదపెంకి, బలిజిపేట మండలం

ఇంటింటి కుళాయి పైప్‌లకు మరమ్మతులు



పైప్‌లైన్లకు చేస్తున్న మరమత్తులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు పంపిణీ చేయడానికి ప్రత్యేక దృష్టి సారించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని గెడ్డలుప్పి గ్రామంలో రోడ్డు నిర్మాణంలో తొలగించిన ఇంటింటి కుళాయి పైపలకు జరుగుతున్న మరమత్తులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో క్రాష్‌ప్రోగ్రాం ద్వారా బోర్ల మరమ్మతులు సామూహికంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మంచినీటి పథకాల మరమ్మతులు చేపట్టినట్లు తెలియజేశారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ అల్లు తిరుపతినాయుడు పంచాయతీ నిధులు సమకూర్చడంతో మరమ్మతులు చేపట్టామన్నారు. రెండు రోజుల్లో ఇంటింటి కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పార్వతీపురం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఏఐఎస్ఎఫ్ పార్వతీపురం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలకు సమయపాలనతో చేరుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

మూడు కేంద్రాల్లో టెన్త్ పబ్లిక్ పరీక్షలు



మాట్లాడుతున్న ఎంఈఓ జి. సూరిదేముడు

సీతానగరం: మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ–1 జి.సూరిదేముడు తెలిపారు. ఈ మేరకు మండలంలోని జోగింపేటలో పరిక్షా కేంద్రాన్ని నిర్వాహకులతో కలిసి ఆదివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించాల్సిన చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్ మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు అందరూ శనివారం మధ్యాహ్నం 1 గంటకు రిపోర్టు అయినట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ తిరుపతి నాయుడు జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న కేంద్రాల అధికారులందరితో గూగుల్‌మీట్ నిర్వహించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారని చెప్పారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మక్కువ: పదవతరగతి పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నట్లు ఎంఈవో పెంట సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఈ మేరకు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాల, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

నిర్మానుష్యంగా మార్కెట్



నిర్మానుష్యంగా సీతానగరం మార్కెట్

సీతానగరం: మండలంలోని పక్క గ్రామాలనుంచి మండలకేంద్రానికి నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడడంతో పాటు నిత్యావసర సరుకుల కోసం తిరుగాడే వారికి ఎండలు భగ్గుమనడంతో మార్కెట్ ఆదివారం నిర్మానుష్యంగా కనించింది. మండలంలో వారం రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. మండలకేంద్రానికి నిత్యావసర సరుకుల కోసం 25 గ్రామాల ప్రజలు సీతానగరం మార్కెట్‌కు రావడం ఆనవాయితీ. కాగా ఆదివారం ఉదయం 10 గంటలనుంచి ఎండ భగ్గుమనడం వల్ల ప్రజలంతా ఉదయం 10 గంటలకే ఇళ్లకు చేరుకోవడంతో మార్కెట్ నిర్మానుష్యంగా కనిపించింది. దీంతో వర్తకులు షాపులు మూసివేసి ఇళ్లకు పరిమితమవుతున్నారు. ఈ విషయమై వర్తక సంఘం జిల్లా నాయకుడు వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎండల కారణంగా నాలుగు రోజులుగా వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయన్నారు.

ఘనంగా దేవతామూర్తుల ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మక్కువ: మండలంలోని చెముడు గ్రామంలో లక్ష్మీ సరస్వతి, వరదగణపతి దేవతామూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోదర్శనం, కుంభదర్శనం, సిద్ధి, బుద్ధి సహిత గణపతి కల్యాణం కార్యక్రమాలను వేదపండితులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, పార్టీ నాయకులు లక్ష్మీసరస్వతి, వరదగణపతిలను దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఏనుగుల జోన్‌నిర్మాణ పనులు ఆపాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు ఆర్.వేణు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం సీతానగరం మండలంలోని జోగింపేట పరిధిలో ఏనుగుల జోన్‌ను జనావాసాల మధ్య ఏర్పాటు చేయడాన్ని విరమించుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివారం మండల సీపీఎం కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు సీతానగరం మండలంలోని జోగింపేట–అప్పయ్యపేట, గుచ్చిమి గ్రామాల సమీపంలో ఉన్న కొండపై ఏనుగుల జోన్ నిర్మాణం చేస్తున్న ప్రాంతంలో గత ప్రభుత్వం గిరిజన, ఎస్సీ కుటుంబాలకు భూములిచ్చిందని అందులో వ్యవసాయ పనులు చేసుకుంటూ కొన్ని కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలియజేశారు. అటువంటి భూముల్లో కొండ చుట్టూ కందకాలు తవ్వడాన్ని విరమించుకోవాలని కోరారు.ప్రభుత్వం స్పందించి ఏనుగుల జోన్ నిర్మాణ పనులను నిలిపివేయాలని లేని పక్షంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కమిటీ నాయకులు జీవీ రమణ, రెడ్డి లక్ష్మునాయుడు, బి.అప్పారావు, ఆర్‌వీ రమణమూర్తి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి సాలూరు మండలంలోని పురోహితునివలస ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అంజలిదేవి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారు రూ. 200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాలని పేర్కొన్నారు. 10వ తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఏపీఎంఎస్, ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్, సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లను సంప్రదించాలని సూచించారు.

కుట్టుమిషన్ శిక్షణ పూర్తి



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌లను అందజేస్తున్న దృశ్యం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని సారిపల్లి రత్నాలమ్మ జ్ఞాన మందిరంలో ప్రారంభించిన 45 రోజుల కుట్టుమిషన్ శిక్షణ పూర్తయింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులు, మహిళలకు సర్టిఫికెట్‌లను జూనియర్ లెక్చరర్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారిపల్లి దాలి మృత్యుంజయరావు, ఆశయాలకు అనుగుణంగా పార్వతీపురంలో నివసిస్తున్న విద్యార్థినులు, పేద మహిళలకు ఉచిత కుట్టుమిషన్ ట్రైనింగ్ కార్యక్రమం వల్ల అనేక మంది పేదవారికి ఉపయోగకరంగా ఉందన్నారు. సారిపల్లి దాలి మృత్యుంజయ రావు ఆశయాలను కొనసాగిస్తున్న ట్రస్ట్ చైర్మన్ కరుణాకర్, డైరెక్టర్ కిశోర్‌లు రాబోయే రోజుల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి, పేద విద్యార్థులకు ఆదుకోవాలని పార్వతీపురంలో నిరుద్యోగ యువతను తగ్గించి, ప్రజలకు ఉపాధిని కల్పించాలని కోరుతున్నానన్నారు. కార్యక్రమంలో సారిపల్లి ధ్యానమందిర్ మేనేజర్ సూర్యారావు, కుట్టుమిషన్ ట్రైనర్ గౌరీశ్వరి పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



బర్లిలో బిందెలు పట్టుకుని నిరసన తెలుపుతున్న మహిళలు

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామంలో గత 20 రోజుల నుంచి తాగునీరు అందక అవస్థలు పడుతున్నామని, దాహంతో ప్రజలు అలమటించుకుపోతున్నారని రెండవవార్డు మెంబరు తాడి లక్ష్మమ్మ, మహిళలు తెలిపారు. ఈ మేరకు సీపీఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు మన్మథరావు, రైతు సంఘం నాయకుడు ఏగోటి కృష్ణమూర్తి, రెండవ వార్డు మెంబరు లక్ష్మమ్మలు మాట్లాడుతూ గడిచిన 20రోజులుగా తాగునీరు అందక బర్లిగ్రామ ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. తాగునీటికి నిరసన చేయాల్సిన పరిస్థితులు వచ్చాయని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న క్లబ్ సభ్యులు, తదితరులు

సాలూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని సాలూరు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాలూరు వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని చినబజార్ సమీపంలో శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగుజాతి వారందరికీ ఓ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీరాములు కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సరదా మాటున ప్రమాదం

- ఒంటిపూట బడులు ప్రకటించిన విద్యాశాఖ
- తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలి
- చెరువులు, నేలబావులు, నిర్మాణాలు, గుంతల వైపు వెళ్లనీయొద్దు



రహదారిపై సైకిళ్లతో విద్యార్థులు

పార్వతీపురం రూరల్:

ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యాశాఖ జిల్లాలోని పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహిస్తోంది. దీంతో ఎక్కువ సమయం పిల్లలు ఆడుకోవడానికి ఇష్టపడుతున్నారు. బడి నుంచి ఇంటికి వచ్చిన వెంటనే ఎంచక్కా ఆటల బాట పడుతున్నారు. తల్లిదండ్రులు ఎంతచెప్పినా వినకుండా స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి హాయిగా గడపాలనుకుంటున్నారు. ఈ ఆనంద సమయాల్లో ఎన్నో అనర్థాలు పొంచి ఉన్నాయనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పిల్లలు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంటుంది. ఒంటిపూట బడి సమయంలో పాఠశాల అయిపోయాక చిన్నారులు ఇంటికి పరిమితం కాకుండా తోటిపిల్లలు, స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. వేసవిలో ఎండకు తిరిగి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. పిల్లలను ఇంటి ఆవరణలో, పరిసర ప్రాంతంలో ఆడుకునేలా, చదువుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. పాఠశాల అనంతరం వారిని ఇంటిపట్టునే ఉండేలా చూడాలి.

వాహనాలతో జాగ్రత్త

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లంటే పిల్లలకు మోజు ఎక్కువ. ఇంట్లో చెప్పకుండా వాటిని నడుపుతూ రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చిన్నారులను మోటారుబైక్‌లు, సైకిళ్లకు దూరంగా ఉంచాలి. బైక్ తాళాలు వారికి అందుబాటులో ఉంచకూడదు. అవసరమైతేనే పెద్దల పర్యవేక్షణలో వాహనాలు నడపడం నేర్పించాలి. పిల్లలను ఎక్కువ సమయం తిరగనిస్తే పరీక్షల సమయంలో అనారోగ్యానికి గురవవచ్చు.



మట్టిలో ఆడుకుంటున్న చిన్నారులు

సెల్ ఫోన్‌తో అనర్థాలు



చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు సెల్ ఫోన్‌లో కార్టూన్ వీడియోలు చూపిస్తూ స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లకు బానిసలుగా చేస్తారు. ఈ క్రమంలో ముఖ్యంగా సెల్ ఫోన్ల పిచ్చి పట్టే ప్రమాదం ఉంది. ఇది చిన్న పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు మారాం చేస్తున్నారని పెద్దలు ఫోన్లు ఇవ్వడం అలవాటు చేస్తున్నారు. రానురాను ఇది పెద్ద సమస్యగా మారుతుంది. స్మార్ట్ ఫోన్ విపరీతంగా ఉపయోగించడం వల్ల పిల్లలు దానికి బానిసలవుతారు. ఇది పిల్లల మానసిక ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం.

నిర్మాణాలు జరిగే ప్రాంతాలు, కాలువలు, చెరువులతో ప్రమాదాలు

వేసవికాలంలో ఎండ తీవ్రతను తాళలేక పిల్లలు ఈతపై సరదా చూపుతూ ప్రమాదాలకు గురవుతుంటారు. వీలైనంత వరకు పిల్లలను చెరువులు, కాలువలు, బావుల వద్దకు పంపకూడదు. ఈత నేర్పాలనుకుంటే తల్లిదండ్రులే పిల్లలను వెంట తీసుకెళ్లి కొంత సమయం వరకు ఈత నేర్పటం ఉత్తమం. అలాగే నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాదకరమైన గుంతలు ఉంటాయి ఆదమరిచి ఆటల్లో పడి పిల్లలు గుంతల్లో పడే ప్రమాదాలు ఉంటాయి. నిర్మాణాలకు వాడే మెటీరియల్ కూడా పిల్లలకు ఒక్కో సందర్భాను సారం ప్రమాదాన్ని కలిగించే ఆస్కారం ఉంటుంది. అలాంటి ప్రదేశాలకు చిన్నారులు పోకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలి.

తల్లిదండ్రులదే బాధ్యత



పిల్లలపై కోపగించుకోకుండా ప్రేమతో వారిని దగ్గరికి తీసుకోవాలి వడదెబ్బ తగలకుండా పిల్లలను వీలైనంతవరకు ఇంట్లో ఉండే విధంగా కుటుంబ సభ్యులు ప్లాన్ చేసుకోవాలి. ఎక్కువ శాతం ఇంట్లో తయారు చేసే పదార్థాలు మాత్రమే పిల్లలకు ఆహారంగా తీసుకునేందుకు సిద్ధం చేయాలి. బయట దొరికే పదార్థాలను పిల్లలకు అలవాటు చేస్తే రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఒంటి పూట బడుల అనంతరం పిల్లలు వచ్చిన వెంటనే మజ్జిగ లేదా సహజంగా ఇంట్లో తయారు చేసే పండ్ల రసాలను ఇవ్వాలి. పిల్లలు ఆడుకునే ప్రదేశాలను తల్లిదండ్రులు గమనించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఆడుకునే ప్రదేశాలను ఏర్పాటు చేయాలి. – డా.కోరాడ రాజీవ్, చిన్న పిల్లల వైద్యుడు, పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను బదిలీల చట్టంలో చేర్చాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీమోహన్



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకుడు ఎస్.మురళీమోహన్

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను కూడా బదిలీల చట్టంలో చేర్చాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ వినతిపత్రాన్ని అందజేశారు. బదిలీల చట్టంలో పంచాయతీరాజ్, ప్రభుత్వ, మున్సిపల్ ఉపాధ్యాయులను చేర్చారని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను కూడా ఈ చట్టంలో చేర్చేవిధంగా శాసనసభలో చర్చ జరపాలని, అలాగే గిరిజన సంక్షేమ శాఖమంత్రితో మాట్లాడాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ శాసనసభ జీరోఅవర్‌లో ప్రస్తావించి సంబంధిత మంత్రుల దృష్టికి కూడా తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు జి.హేమసుందర్, విష్ణు తదితరులు ఉన్నారు.